క్లుప్తంగా

భక్తిప్రపత్తులతో ప్రదోష కాల పూజలు



విశేష అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎ న్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రదోషకాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివునికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం నందీశ్వరుడికి పాలతో అభిషేకం చేశారు. ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

అంగన్‌వాడీలకు దరఖాస్తుల ఆహ్వానం

కార్వేటినగరం: కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ పద్మసునంద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని శ్రీరంగరాజపురం మండలం సీకే పురం అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్(బీసీ–బీ), కార్వేటినగరం పెద్దదళితవాడలో అంగన్‌వాడీ వర్కర్(ఎస్సీ), ఆర్కే వీబీపేట అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్(ఓసీ), వెదురుకుప్పం మండలంలోని చిన్నపోడు చేను అంగన్‌వాడీ వర్కర్(ఎస్సీ) ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. అర్హులైన వారు ఈ నెల 12వ తేదీ నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులను సీడీపీఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

అంగన్‌వాడీ మినీ కార్యకర్తకు దరఖాస్తు చేసుకోండి

నింద్ర: మండలంలోని కీళంబాకం దళితవాడలో అంగన్ వాడీ కేంద్రం మినీ అంగన్ వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని నగరి సీడీపీఓ కృష్ణవేణి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఆమె మాట్లాడుతూ అర్హులైనవారు 10వ తరగతి పాసై 21 సంవత్సరాల వయసున్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తులు అందించాలని తెలిపారు.

చెస్‌లో నగరి విద్యార్థి ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న నవ్యశ్రీ

నగరి: చెస్ క్రీడలో నగరి మండలం ముడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.నవ్యశ్రీ ప్రతిభ కనబరిచింది. శ్రీనివాస మంగాపురం సమీపం మిట్టపాళెంలో ఆదివారం సప్తగిరి చెస్ అకాడమీ నిర్వహించిన చెస్ పోటీలలో అండర్–15 విభాగంలో ప్రతిభ కనబరచి నవ్యశ్రీ ప్రథమ బహుమతి, ట్రోఫీని కైవసం చేసుకుంది. ప్రతిభ చూపిన విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

అధ్వానంగా పారిశుధ్యం



వేమాపురం : పూడిక తీత పనులకు నోచుకో మురుగు కాలువ

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం, వేమాపురం గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. మురికి కాలువలో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయింది. మురుగు నీరు కాలువల్లో పాచి పట్టిపోవడంతో దోమ లార్వాలు ఎక్కువగా వృద్ధి చెందుతున్నాయి. అధికారులు పారిశుధ్య పనులు చేపట్టి కాలువల్లో పూడిక తీయించాలని కోరుతున్నారు.

సమగ్రశిక్షా తరగతి గది ప్రారంభం

నగరి: మున్సిపల్ పరిధి కొత్తపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష తరగతి గదిని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సదుపాయాలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ ప్రభాకర్‌రాజు, ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమాల అడ్డుకు హామీ

గ్రామీణ ప్రాంతాల ప్రజలు పని కోసం వలసలు వెళ్లకుండా నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చింది. అయితే మారుతున్న తరుణంలో ఉపాధి హామీ పథకంలో నూతన సాంకేతికతతో వచ్చిన యాప్ అక్రమాలను అడ్డుకునేలా ఉంది. పథకంలో అక్రమాలను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం జనవరి 27 నుంచి కొత్త కొత్త యాప్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. కూలీల దొంగ మస్టర్ నమోదు చేయకూడదని కళ్లెం వేయడమే ఈ యాప్ ఉద్దేశం.

– పాలసముద్రం

- ఉపాధి హామీ యాప్‌లలో నూతన సాంకేతికత
- సిబ్బందికి నూతన యాప్‌ల భారం
- కూలీల మస్టర్ ఫొటో తప్పనిసరి
- జనవరి 27 నుంచి అమల్లోకి నూతన యాప్



ఉపాధిహామీ పథకంలో పనులు

మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకంలో జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 31 మండలాలు ఉన్నాయి. 1,38,787 కుటుంబాలు ఉపాధిహామీ పథకంలో భాగస్వామ్యమై ఉన్నారు. వీరు రూ.6,58,000 పైగా ఉపాధి హామీ పని దినాలను ఈ ఏడాది చేసి ఉన్నారు. అయితే ఉపాధి హామీ పథకంలో కొత్తగా తీసుకొచ్చిన యాప్ ఎన్ఎంఎంఎస్ ద్వారానే పనుల వివరాలు నమోదు చేయాలి. ఇందులో కూలీలు పనిచేసే సమయంలో ఉపాధి హామీ సిబ్బంది తీసే ఫొటోలో ఉండే కూలీల సంఖ్య మస్టర్ షీట్‌లో పేర్కొనే సంఖ్యకు ఏమాత్రం తేడా ఉండకూడదు. అలా తేడా ఉంటే ఆ మస్టర్ తిరస్కరిస్తారు. అంతేకాకుండా ఫొటో తీసేటపుడు అక్కడున్న కూలీల్లో కనీసం ఒక్కరైనా కళ్లు ఆర్పినట్లు చేస్తేనే ఆ ఫొటో ఎన్ఎంఎంఎస్‌లో నమోదయ్యేలా యాప్‌ను ఆధునీకరించారు.

ఉపాధి సిబ్బందికి భారం

కొత్త యాప్ ప్రవేశ పెట్టడంతో ఉపాధి హామీ సిబ్బందిపై కొంత అదనపు భారం పడనుంది. ఓ వైపు తగిన మంది సిబ్బంది లేని కొన్నిచోట్ల ఇన్‌చార్జి బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కూలీల హాజరు వేతనాల బిల్లుల నమోదు తదితర ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. ఈ వెబ్‌పోర్టల్ పూర్తిగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధీనంలో పనిచేస్తుంది. ఈ పథకం అమలులో రోజువారీ పనికి హాజరవుతున్న కూలీల వివరాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణకు ఆన్లైన్ వెబ్ పోర్టల్‌కు అనుసంధానంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్ఎంఎంఎస్) పేరుతో ప్రత్యేక మొబైల్ యాప్‌ను కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ చాలా ఏళ్లుగా వినియోగిస్తుంది. ఇప్పుడు యాప్‌ల నిర్వహణలో కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా అందులో కొన్ని సాంకేతిక మార్పులు చేసింది.

ఇవీ కొత్త నిబంధనలు

2025 జనవరి 27 నుంచి అమల్లోకి వచ్చిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) యాప్ ద్వారా కూలీల నమోదులో కేంద్రం కొత్త నిబంధనల అమలును తప్పనిసరి చేసింది. ఈ నూతన ప్రక్రియలో గతంలో ఎపుడో తీసిన ఫొటోలను ఆన్‌లైన్‌లో నమోదుకు వీలు లేకుండా అదనపు జాగ్రత్తలు చేపట్టింది. ఏరోజు ఎంతమంది కూలీలు హాజరయ్యారన్నది క్షేత్రస్థాయిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్ లేదా మేట్లు ఆన్‌లైన్‌లో మస్టర్ నమోదు చేయాలి. పని ప్రదేశంలో కూలీలు పనిచేస్తున్న ఫొటోను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి. ఈ మస్టర్ ఆధారంగానే వారానికి ఒకసారి కూలీలదరికీ వేతనాలు చెల్లింపు చేస్తారు. ఇది కొన్నేళ్లుగా జరుగుతున్న విధానమే. అయితే ఇందులో ఫొటోలో కూలీల సంఖ్య ఎంతమంది ఉన్నారు. అది ఎప్పటిది అనే విషయాన్ని పెద్దగా పట్టించుకునేవారు కాదు. కనీసం ఒక్క మనిషి ఫొటోలో లేకపోయినా మస్టర్‌లో పేర్కొనే కూలీల సంఖ్య ఆధారంగా బిల్లులు చెల్లించేవారు. అయితే ఇకపై ఫొటోలో సంఖ్యకు, మస్టర్ సంఖ్యకు ఏమాత్రం తేడా ఉండకూడదన్నదే కఠినమైన నిబంధన.

ఏడాదికి ఒక కొత్త యాప్



ఉపాధి హామీ పథకంలో పనులు చేయడానికి ఇబ్బందులు పడుతు న్నాం. గతంలో ఉపాధిహామీ పథకంలో పనులు చేసే కచ్చితంగా బిల్లులు వస్తాయని అనుకుని పనులు చేస్తున్నాం. ఇప్పుడు ఏడాదికి ఒక సారి కొత్త యాప్‌లు పెట్టడంతో ఉపాధి హామీ పనులకు వెళ్లి పనులు చేయాలంటే బిల్లు వస్తుందో లేదో అని అనుమానం వస్తున్నది. బిల్లులు సకాలంలో పడడం లేదు. – పాండు, కేజే పురం, ఉపాధి హామీ కూలీ

కూలీల నమోదు తప్పనిసరి



ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీల సంఖ్యను ఫీల్డ్‌అసిస్టెంట్, సీనియర్ మేట్లు పనిచేసే చోట ఫొటోలోని కూలీల సంఖ్య మస్టర్లో సంఖ్య ఒకే ఉండాలి. అప్పుడే కూలీలకు బిల్లులు వస్తాయి. ఫొటోలో తేడా ఉంటే ఆ మస్టర్ షీటు పరిగణించరు. వేతనాలు కూడా చెల్లించరు. ఫొటో బాధ్యతగా తీయాలి. – కృష్ణమహేష్‌రెడ్డి, ఎంపీడీఓ, పాలసముద్రం

పారదర్శకంగా ఉపాధి పనులు



ఉపాధి పనులను పారదర్శకంగా చేపట్టేందుకు ఎన్ఎంఎంఎస్ యాప్ ఉపయోగపడుతుంది. డి మస్టర్ ఫోకస్ ఏరియా యాప్‌లో గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నాం. ఉపాధి పనులు పారదర్శకంగా, క్షేత్రస్థాయిలో అక్రమాలకు పాల్పడకుండా ఉండేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి పని కల్పించడం. ప్రతి రైతుకు సహజ వనరుల యాజమాన్య పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం. – సుబ్రహ్మణ్యం, ఏపీడీ, ఉపాధిహామీ పథకం

రైతులకు గుర్తింపు నెంబర్లు



ఏఓ భవాని

గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ అధికారి రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇస్తున్నారని, రిజిస్టర్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి భవాని ఒక సోమవారం ప్రకటనలో తెలిపారు. రైతులు తమ ఆధార్ నెంబర్, పేరు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కు లింకై ఉన్న ఫోన్ నెంబరు వివరాలు తీసుకుని వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకు వెళితే వారు నమోదు చేసి విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇస్తున్నారు. రైతులు ఫిబ్రవరి నెలాఖరులోపు ఈ విశిష్ట గుర్తింపు సంఖ్యను తీసుకోవాలని ఆమె కోరారు. ఈ విశిష్ట సంఖ్య ఉన్న రైతులకు మాత్రమే వివిధ పథకాలు అందుతాయని ఆమె అన్నారు.

తాగునీటి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంపీడీఓ క్రిష్ణమహేష్ రెడ్డి

పాలసముద్రం: రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ క్రిష్ణమహేష్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీర్ అసిస్టెంట్‌లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ క్రిష్ణమహేష్ రెడ్డి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సూడాలని హెచ్చరించారు. తాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్ బాధ్యతగా చేపట్టాలని తెలిపారు. మురుగునీటి కాలువలు, ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా మలాథియాన్ పిచికారీ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శంకర్ పాల్గొన్నారు.

రైతన్నకు డిజిటల్ గుర్తింపు

రైతులకు డిజిటల్ గుర్తింపు సంఖ్య(విశిష్ట గుర్తింపు సంఖ్య)ను ఇచ్చే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇందులో భాగంగా రైతులకు రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతుగా నమోదు చేసే ప్రక్రియను సోమవారం నుండి ప్రారంభించారు. రైతు సేవా కేంద్రాలకు అందుబాటులో ఉండే రైతుల వద్దకు విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, హార్టికల్చర్, సిరికల్చర్ అసిస్టెంట్లు వెళ్లి యాప్‌ల ద్వారా వివరాలు నమోదు చేశారు. రైతు సేవా కేంద్రాలకు విచ్చేసి గుర్తింపు సంఖ్యను పొందాలని సూచించారు.

– నగరి

- రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య
- ప్రత్యేక యాప్ ద్వారా నమోదు
- గుర్తింపు సంఖ్య లేకుంటే పథకాలు అందవు
- నమోదుకు ఈ నెల చివర వరకు గడువు



మేళపట్టులో రైతు వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

విశిష్ట గుర్తింపు సంఖ్య లేకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు రైతులకు అందవు. ప్రధానంగా పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు కూడా రైతులకు అందవు. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలకు కూడా దూరమవ్వాల్సి ఉంటుంది.

ఇలా నమోదు చేసుకోవాలి

- రైతులు రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి వారి పేరు, ఊరు, ఆధార్ నంబర్, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కి లింక్ అయిన ఫోన్ నెంబర్ వివరాలను అందించాలి.
- నమోదు ప్రక్రియ పూర్తయ్యాక వారికి విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు.
- రైతు సేవాకేంద్రాలకు వెళ్లలేకపోతే, సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరాలు అందించి. ఓటీపీ చెప్పడం ద్వారా రైతులు వివరాలు నమోదు పూర్తి చేసుకోవచ్చు.


ఇలా భద్రపరచుకోవాలి

యాప్ ద్వారా నమోదు చేసుకున్న తరువాత అందించే గుర్తింపు సంఖ్య మెసేజ్ రూపంలో రైతు ఫోన్‌కు వస్తుంది. ఆ నెంబరును అతను ఫోన్‌లోగానీ భద్రపరచుకోవడం గానీ, పాసుపుస్తకాలపై రాసి ఉంచిగాని గుర్తుంచుకోవాలని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. గుర్తింపు సంఖ్య మరచిపోతే రైతు సేవా కేంద్రానికి వెళ్లి వివరాలు అందించి గుర్తింపు సంఖ్యను తెలుసుకోవచ్చు.



బీఎన్‌ఆర్ పేటలో రైతు వివరాల నమోదు ప్రక్రియ

నెలాఖరు వరకు గడువు



రైతులందరూ ఈ నెల చివరలోపు వెంటనే ఫార్మర్ రిజిస్ట్రీలో పేరును నమోదు చేసుకోవాలి. లేకుంటే ప్రభుత్వం అందించే పథకాల ప్రయోజనాలు పొందే అవకాశాలు కోల్పోతారు. సమీప రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రైతులు నమోదు చేసుకోవాలి. – రాఘవేంద్ర యాదవ్, వ్యవసాయ అధికారి, నగరి మండలం

మామిడి పూత కోసం యత్నాలు



కేశవపురంలో మందుల పిచికారీ

విజయపురం: మండలంలో మామిడి పూత కోసం రైతులు విశ్వప్రయత్నం చేస్తున్నారు. అరకొర పూతలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు మందులు పిచికారీ చేశారు. అయినా పూత అంతంత మాత్రంగానే ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 2వేల ఎకరాలకు పైగా మామిడి సాగు ఉంది. విజయపురం, కోసలనగరం, కేశవపురం, పాతర్కాడు, మహారాజపురం, నార్పరాజుకండ్రిగ, మాల్లారెడ్డికండ్రిగ, శ్రీహరిపురం తదితర గ్రామాల్లోని రైతులు మామిడి సాగుపైనే ఆధారపడి జీవిస్తుంటారు. గత ఏడాది ధర బాగున్నా... ఆశించిన స్థాయిలో పంటలు దిగుబడి లేకపోవడంతో రైతులు తీవ్ర నష్టపోయారు. ఈ ఏడాదైన దిగుబడి పెరిగి అప్పులు తీర్చుకుందామంటే ఈ సారి కూడా పూత లేకపోవడంతో రైతులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

ధ్రువీకరణ పత్రాలు ఇవ్వండి

పుత్తూరు: నేసనూరు లెక్క దాఖలలోని సర్వే నెంబర్ 186లోని సుందరయ్యనగర్‌లో ఇళ్లు నిర్మించుకొని జీవిస్తున్న తమకు ఇంటి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరుతూ పలువురు మహిళలు సోమవారం తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ 2011లో ఇళ్లు నిర్మించుకొని నివశిస్తున్న తమకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వని కారణంగా తాము ఇంటి రుణాలను పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గణపతినగర్‌లో ఇంటి పట్టాలు పొందిన 36 మందిలో 30 మంది ఇళ్లు నిర్మించుకొన్నారని, అయితే ఇందుకు సంబంధించిన రోడ్డును కొందరు ఫెన్సింగ్ వేసి ఆక్రమించుకొన్నారని ఆరోపించారు. సర్వే నిర్వహించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి అందరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

నులిపురుగులు ప్రమాదకరం







కత్తెరపల్లిలో అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ హేమశ్రీ, నింద్రలో నులిపురుగుల మాత్రల పంపిణీ, అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రవీణ

కార్వేటినగరం: పిల్లల కడుపులో నులి పురుగులు ఉంటే ఎదుగుదల నిలిచి పోతుందని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ హేమశ్రీ అన్నారు. సోమవారం కత్తెరపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఆర్కేవీబీపేట, పాదిరికుప్పం, డీఎంపురం, కేఎం పురం, గంగమాంబాపురం, ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ తప్పనిసరి

నింద్ర: పిల్లలలో రక్తహీనతకు నులిపురుగులే కారణమని వైద్యాధికారి డాక్టర్ వినీషా అన్నారు. సోమవారం మండల కేంద్రమైన నింద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ పిల్లలకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: అల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణతోపాటు రక్తహీనత సమస్యలు పరిష్కారమవుతుందని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు మింగించారు. సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపరవైజర్ సుశీల, మురళి, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు: పరిసరాలను పరిశుభ్రతంగా ఉంచుకోవడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చునని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వీరయ్య తెలిపారు. సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కళాశాల హెల్త్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ జయప్రద, సభ్యులు షర్మిల, పద్మావతి, సావిత్రి పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలంలోని జడ్పీ హైస్కూల్, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, వైద్య సిబ్బందితో కలిసి డాక్టర్ దుర్గాదేవి మందులు పంపిణీ చేశారు. ఆల్బెండజోల్ మాత్రలను 6890 మంది పిల్లలకు సోమవారం వేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం: మండలం వ్యాప్తంగా పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. విజయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ రాజేంద్ర మాత్రల పంపిణీ ప్రారంభించారు. డాక్టర్ సోమశేఖర్ పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: నులిపురుగుల నివారణే లక్ష్యమని వైద్యాధికారి ప్రవీణ అన్నారు. సోమవారం వెదురుకుప్పం జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తినిపించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఏఎన్ఎం ఎర్రసాని పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా నులిపురుగుల మందులు వేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లోకనాథ పిళ్లై, ఎంపీడీఓ మోహన్ మురళి, మండల వైద్యాధికారులు గిరి, గౌరీ, ఎంఈఓ అరుణాచలం రెడ్డి, సబర్మతి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు నమోదు చేసుకోండి

వడమాలపేట (విజయపురం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వాలని నిర్ణయించినట్టు ఏఓ విజయకుమార్ తెలిపారు. సోమవారం వడమాల రైతు సేవా కేంద్రంలో డిజిటల్ గుర్తింపు కార్డు నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో రైతు వివరాలు నమోదు చేస్తామన్నారు. ఈ నెల 10 నుంచి 28 వరకు జరుగుతుందని పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గంగాధరనెల్లూరు:ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ వినితశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కలిజవేడు(ఓసీ), కోటాగారం హరిజనవాడ (ఎస్సీ), తిరువీధికుప్పం(ఓసీ) అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.